
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 4 జూన్ 2024 | 5



ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	34	30





శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో బందోబస్తు





మీడియా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన పి.గన్నవరం నియోజకవర్గ ఫలితాలు తెలిపే బోర్డు



ఎప్పటికప్పుడు ఫలితాలు చూసేందుకు మీడియా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన టీవీలు

ప్రజా తీర్పు

నేడే

నరాలు తెగే ఉత్కంఠతో ఎదురుచూస్తున్న ఓటర్ల తీర్పు మంగళవారం వెలువడనుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం రిజర్వుడు లోక్‌సభ నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చిన విలక్షణ తీర్పులో ప్రధాన రాజకీయ పార్టీల తరపున పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాకు సంబంధించిన ఓట్ల లెక్కింపును నిర్వహించేందుకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ట్రాఫిక్ మళ్లింపు, భారీ భద్రతా చర్యలు చేపట్టారు.

- కోనసీమ జిల్లాలో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం ఎనిమిది గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- భారీ భద్రతా చర్యలు.. ట్రాఫిక్ మళ్లింపు
- ముమ్మిడివరం వైపు కదులుతున్న కౌంటింగ్ ఏజెంట్లు
- అభ్యర్థుల మెజార్టీలపై జోరుగా పందేలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రెండేళ్ల క్రితం జరిగిన అల్లర్ల నేపథ్యంలో కోనసీమ జిల్లాలో ప్రశాంత పరిస్థితుల నడుమ కౌంటింగ్ నిర్వహించడానికి ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం విస్తృతస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టింది. ఒక్కమాటలో చెప్పాలంటే ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా అమలాపురం పట్టణంతో పాటు కోనసీమవ్యాప్తంగా ఉన్న కీలక ప్రాంతాల్లో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణాన్ని పోలీసులు అమలు చేస్తున్నారు. వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసివేయాలని పోలీసులు ఆదేశించారు. ఇప్పటికే మద్యం షాపులు, బార్‌లకు సీలు వేశారు. చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల మీదుగా వెళ్లే వాహనాలు అన్నింటినీ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించారు.

కోనసీమ జిల్లాలో గత నెల 13న జరిగిన ఎన్నికల్లో 15,31,410 మంది ఓటర్లకు గాను 12,84,008 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కౌంటింగ్‌లో భాగంగా తక్కువ ఓటర్లు కలిగిన రాజోలు నియోజకవర్గ ఫలితం మొదటగా వెలువడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో కొంత జాప్యం జరగవచ్చంటున్నారు. జిల్లాలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులకే విజయావకాశాలు ఎక్కువ ఉన్నట్టు నాడిని బట్టి అంచనా వేస్తున్నారు. దీంతో కూటమి అభ్యర్థుల మెజార్టీలపై పందేలు వేస్తున్నారు. అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులే గెలుపొందుతారనే ప్రచారాలనేపథ్యంలో ఆయా పార్టీల శ్రేణులు సంబరాలకు సిద్ధమవుతున్నాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో జిల్లా నలుమూలల నుంచి ఆయా రాజకీయ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు సోమవారం రాత్రికే అమలాపురం పరిసర ప్రాంతాల్లో మకాం వేసి విందులు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరైతే ముమ్మిడివరం పట్టణ పరిసరాల్లో ఉన్న కల్యాణ మండపాలు, అతిథి గృహాల్లో మకాం వేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల వివరాలు...

రామచంద్రపురం: 2,03,207 మందికి 1,73,917 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 13,253, మహిళలు 16,039. పోలింగ్ శాతం 85.59. అసెంబ్లీ ఓట్ల లెక్కింపు కోసం 10 టేబుళ్లు, లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు 10 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 239 పోలింగ్ కేంద్రాల్లో ఓట్లను 17 రౌండ్లలో లెక్కిస్తారు.

ముమ్మిడివరం: 2,45,296 మందికి 2,05,163 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 18,175, మహిళలు 21,958. అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 268 పోలింగ్ కేంద్రాల్లో ఓట్లను 19 రౌండ్లలో లెక్కిస్తారు.

అమలాపురం: 2,13,508 మందికి 1,75,845 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 17,261. మహిళలు 20,402. అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు 12 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 235 పోలింగ్ కేంద్రాల్లో ఓట్లను 15 రౌండ్లలో లెక్కిస్తారు.

రాజోలు: 1,97,920 మందికి 1,56,400 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 20,456. మహిళలు 21,064. అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 205 పోలింగ్ కేంద్రాల్లోని ఓట్లను 15 రౌండ్లలో లెక్కిస్తారు.

పి.గన్నవరం: 1,98,602 మందికి 1,65,749 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 15,476, మహిళలు 17,374. అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు 12 టేబుళ్లు, లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు 12 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 212 పోలింగ్ కేంద్రాల్లోని ఓట్లను 15 రౌండ్లలో లెక్కిస్తారు.

కొత్తపేట: 2,52,383 మందికి 2,14,975 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 17,279, మహిళలు 20,114. అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు 10 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 262 పోలింగ్ కేంద్రాల్లోని ఓట్లను 19 రౌండ్లలో లెక్కిస్తారు.

మండపేట: 2,20,494 మందికి 1,91,959 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.పురుషులు 13,003, మహిళలు 15,528. అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు 10 టేబుళ్లు, లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు 10 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 223 పోలింగ్ కేంద్రాల్లోని ఓట్లను 16 రౌండ్లలో లెక్కిస్తారు.

ట్రాఫిక్ ఆంక్షల్లో భాగంగా కాకినాడ నుంచి అమలాపురం వైపు వెళ్లే వాహనాలు కొండాలమ్మ చింత, బైపాస్ నుంచి ముక్తేశ్వరం మీదుగా అమలాపురం చేరుకోవాలి. అమలాపురం నుంచి కాకినాడ వెళ్లే వాహనాలు అనాతవరం, మాగాం, క్రాపచింతలపూడి మీదుగా కొండాలమ్మచింత మీదుగా వెళ్లాలి. కాకినాడ వైపునకు ఎటువంటి భారీ వాహనాలను అనుమతించడం లేదు. భారీ వాహనాలను భట్నవిల్లి వై.జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం 4.30 గంటల నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు నిలిపివేస్తారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ట్రెండ్ సెట్ చేసేనా!

అమలాపురం టౌన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పోస్టల్ బ్యాలెట్‌లతోనే ప్రారంభమవుతుంది. మంగళవారం ఉదయం 8 గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామని జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఎన్నికల ఫలితాల సరళి ఎలా ఉండబోతోందో ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లతోనే తేలనుంది. దాంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ట్రెండ్ సెట్ చేయడం ఖాయమేనా అన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. జిల్లాలో 18వేల మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. ఇందులో అత్యధికంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు 15,201 మంది వున్నారు.

కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

ముమ్మిడివరం, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రానికి సోమవారం లెక్కింపు సిబ్బంది చేరుకున్నారు. జిల్లాలోని ముమ్మిడివరం, అమలాపురం, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చారు. పోలీసుల తనిఖీ అనంతరం వారిని లోపలకు పంపించారు. కౌంటింగ్ ప్రక్రియ ఎలా నిర్వహించాలి, తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్

కౌంటింగ్ కేంద్రం వద్ద 700 మంది సిబ్బందితో భద్రత: ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, జూన్ 3: కౌంటింగ్ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. పోలీసు నిఘా నీడన మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద 700 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 200 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు, ముగ్గురు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలతో పాటు పోలీసులతో కలిపి మొత్తం 700 మంది సిబ్బందిని నియమించినట్టు ఎస్పీ తెలిపారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వీడియోగ్రాఫర్లను నియమించారు. ప్రతి అంశం కెమెరాలో నిక్షిప్తమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ప్రధాన గేట్ల వద్ద డోర్‌ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌కు హాజరయ్యే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి లోపలికి పంపిస్తారు.



ఈవీఎంల్లో సాంకేతిక సమస్యలపై అవగాహన కల్పిస్తున్న కైలాస బుండేల

ఈవీఎంల్లో సాంకేతిక లోపాలొస్తే అందుబాటులో 'బెల్' ఇంజనీర్లు

కౌంటింగ్ పరిశీలకుడు కైలాస బుండేల

అమలాపురం టౌన్, జూన్ 3:

ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో సాంకేతిక లోపాలు తలెత్తితే తక్షణం సరిదిద్దేందుకు బెల్ కంపెనీ ఇంజనీర్లు అందుబాటులో ఉంటారని కౌంటింగ్ పరిశీలకుడు కైలాస బుండేల పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. పూర్తి అవగాహన, కచ్చితత్వంతో త్వరితగతిన ఈవీఎంల ఫలితాల వెల్లడికి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి కౌంటింగ్ సూపరింటెండెంట్లు, సహాయకులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో మండపేట అసెంబ్లీ నియోజకవర్గ లోక్‌సభ మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ సహాయకులకు ఈవీఎంలలో తలెత్తే సాంకేతిక సమస్యలను అధిగమించే విధానాన్ని వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపును పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఎన్నికల కమిషన్ మార్గ దర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని, ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మండపేట రిటర్నింగ్ అధికారి డీవీఎస్ యల్లారావు మాట్లాడుతూ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఎంట్రీ పాయింట్ ఉందన్నారు. ఎక్కడా ఎటువంటి గందరగోళానికి తావు లేకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

రెండు కిలోమీటర్ల మేర రెడ్‌జోన్

అమలాపురం టౌన్, జూన్ 3: చెయ్యేరులోని శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం చుట్టూ రెండు కిలోమీటర్ల మేర రెడ్‌జోన్‌గా ప్రకటించినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. జిల్లా అంతటా సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలు పరుస్తున్నామన్నారు. లెక్కింపు కేంద్రాన్ని నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు. కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు, ఏజెంట్లు, అభ్యర్థులను జిల్లా ఎన్నికల అధికారి గానీ, ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాస్ ఉంటేనే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తారు. రిటర్నింగ్ అధికారులు మినహా ఇతరులెవరూ కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకువెళ్లరాదు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు కేంద్రం బయట ఏర్పాటు చేసే డిపాజిట్ కేంద్రంలో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను అప్పగించాలి. లేదా వారి వాహనాల్లో భద్రపరుచుకోవాలి.

అభ్యర్థులకు సూచనలు...

- సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు మంగళవారం ఉదయం ఆరు గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి. జిల్లా ఎన్నికల అధికారి (లేదా) రిటర్నింగ్ అధికారి ఇచ్చిన గుర్తింపు కార్డును విధిగా కలిగి ఉండాలి.
- పార్టీ కార్యకర్తలు ఎవరినీ కౌంటింగ్ కేంద్రం వద్దకు తీసుకు రాకూడదు.
- కౌంటింగ్ కేంద్రం బయట రోడ్లపై విజయోత్సవ ర్యాలీలు నిషేధం. బాణసంచా కాల్చరాదు.
- ఫంక్షన్ హాళ్లు, హోటళ్లలో జన సమీకరణ చేయరాదు.
- వాట్సాప్ గ్రూపులు, ఇతర సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదు.
- ఇతర పార్టీల కార్యాలయాలు, నాయకుల ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు దిగరాదు.
- ఓడిపోయిన అభ్యర్థులపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయరాదు.
- ఈ నెల 6వ తేదీ వరకు ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు జరపకూడదు.

ఏజెంట్లకు ఆల్కహాల్ పరీక్ష: కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, పక్కాగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశాము. లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల భద్రత కల్పించాము. సాయుధ, పోలీసు బలగాలతో పాటు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశాము. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిగేలా అందరూ సహకరించాలి. గెలుపు, ఓటములు సహజమన్న విషయాన్ని గుర్తించి సంయమనం పాటించాలి. జిల్లాలో 5వ తేదీ వరకు మద్యం షాపులు బంద్ చేశాము. అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్లుగా వచ్చే వారికి ఆల్కహాల్ పరీక్ష నిర్వహిస్తాము.

ముమ్మిడివరంలో అభ్యర్థుల శిబిరాలు

ముమ్మిడివరం, జూన్ 3: జిల్లాలోని ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ ప్రక్రియ చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుంది. అభ్యర్థులు ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. దీంతో దూరంగా ఉన్న నియోజకవర్గాల అభ్యర్థులు ముమ్మిడివరంలో శిబిరాలను ఏర్పాటు చేసుకున్నారు. గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు ముమ్మిడివరం టీటీఆర్ నగర్‌లో శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన అన్ని వసతులూ సమకూర్చు కున్నారు. గిడ్డి సత్యనారాయణ కౌంటింగ్ ఏజెంట్లతో కలిసి సోమవారం రాత్రికే శిబిరానికి చేరుకోగా బండారు సత్యానందరావు తన ఏజెంట్లను సోమవారం రాత్రికి ముమ్మిడివరం తరలించారు. ఆయనతో పాటు ముఖ్య నాయకులు కొత్తపేటలోని కల్యాణ మండపం నుంచి తెల్లవారుజామున 4.30 గంటలకు బయల్దేరి ముమ్మిడివరం రానున్నారు. మండపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు కొమానపల్లిలోని వెత్సా ధ్రువరాజా ప్రైవేటు లే-అవుట్‌లోని గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటుచేసిన శిబిరానికి సోమవారం సాయంత్రానికి చేరుకున్నారు. మండపేట అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు అమలాపురం నుంచి మంగళవారం ఉదయం ముమ్మిడివరం రానున్నారు. ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) మంగళవారం ఉదయం మురమళ్ల నుంచి బయల్దేరి కౌంటింగ్ కేంద్రానికి చేరుకుంటారు.



ముమ్మిడివరం టీటీఆర్ నగర్‌లోని ఓ శిబిరంలో ఏర్పాట్లు



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న అశోక్‌కుమార్

అలజడులు సృష్టిస్తే జైలుకే


ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

అమలాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా అలజడులు సృష్టిస్తే జైలుకు పంపిస్తామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపును విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఎస్పీ వివరించారు. సున్నితమైన ప్రాంతాలను గుర్తించడంతో పాటు ఎక్కడికక్కడ పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశామన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు అభ్యర్థులు గానీ, వారి తరపున ప్రతినిధులు గానీ ఎప్పటికప్పుడు పరిశీలించుకునేందుకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్దిత పాస్ లేకుండా ఎవరినీ అనుమతించవద్దన్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యక్తిగత దూషణలకు, ఉద్రిక్తతలకు సోషల్ మీడియాలో కారకులైన వారిపై ఐటీ యాక్టులో కేసులు నమోదు చేసి రౌడీషీట్లు ఓపెన్‌చేస్తామన్నారు. ఓట్ల లెక్కింపు దృష్ట్యా జిల్లా అంతటా పోలీసు అధికారులు ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా మొబైల్ పార్టీలతో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా రాజకీయ నాయకులు, ప్రజలు సంయమనంతో ఉండాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.


మండపేట పట్టణంలో బలగాల కవాతు



చెయ్యేరులోని కోనసీమ జిల్లా కౌంటింగ్ కేంద్రం వద్ద సిబ్బంది సందడి


పిఠాపురంలో పోలీసు బలగాల మోహరింపు

కౌంటింగ్‌కు రెడీ

● విస్తృత ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం అధికారులు ● కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏర్పాటు చేసిన మూడు కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేశారు. రాజమహేంద్రవరం జిల్లాకు సంబంధించి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే కాకినాడ జిల్లాకు కాకినాడలోని జేఎన్టీయూకే కేంద్రంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి చెయ్యేరు ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. మూడు లెక్కింపు కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రతి కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు..


కాకినాడలో స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు




కాకినాడ కేంద్రంలో ఏర్పాట్లు



సమీక్ష నిర్వహిస్తున్న రవిప్రకాష్

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

అల్లర్లు జరగకుండా బలగాల మోహరింపు

పిఠాపురంలో పర్యటించిన డీఐజీ రవిప్రకాష్

పరిస్థితులపై ఎస్పీలతో సమీక్ష

పిఠాపురం, జూన్ 3: కౌంటింగ్ సమయంలోనూ, తదనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఐజీ ఎం.రవిప్రకాష్ వెల్లడించారు. ఆయన సోమవారం సాయంత్రం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు. సర్కిల్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ప్రత్యేక పరిశీలకుడు, ఎస్పీ రామ్మోహనరావు, ఇతర పోలీసు అధికారులు స్థానికంగా ఉన్న పరిస్థితులపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో పిఠాపురం, కాకినాడ నియోజకవర్గాలు, తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం నియోజకవర్గాలను సెన్సిటివ్‌గా గుర్తించినట్లు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంపై రాష్ట్రవ్యాప్తంగా దృష్టి ఉందని, ఈ నేపథ్యంలో పోలీసుశాఖాపరంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పిఠాపురానికి ప్రత్యేకంగా ఎస్పీ స్థాయి అధికారిని నియమించామని, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు 50 మంది, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీలు, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, పెట్రోలింగ్, మొబైల్ టీమ్‌లను రంగంలోకి దించామని వివరించారు. ఎక్కడా ఎటువంటి సంఘటన జరిగినా 15 నిమిషాల లోపుగానే అక్కడకు చేరుకునే విధంగా బలగాలను మోహరించామని చెప్పారు. జాతీయ రహదారితో పాటు కత్తిపూడి, సామర్లకోట, కాకినాడ రహదారులపై ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేసి అనుమతి లేని వారిని కాకినాడ వెళ్లకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. లాడ్జీలు, హోటల్స్‌ల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనధికారిక, ఇతర ప్రాంతాల వ్యక్తులు ఉన్నట్లు గుర్తిస్తే వారిని పంపివేస్తున్నట్లు తెలిపారు. తాటిపర్తి, విరవాడ సహా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు సంయమనం పాటించాలని, శాంతియుతంగా ఉండాలని కోరారు. ఎవరైనా గొడవలకు దిగినా, రెచ్చగొట్టే వాఖ్యలు చేసినా, దాడులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని, అల్లర్లు, గొడవలకు దిగే వారిపై ఆర్‌పీ యాక్టు, ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు. కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. సమావేశంలో ఎస్పీలతో పాటు కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రాజమండ్రి నన్నయ వర్సిటీ కేంద్రం వద్ద తనిఖీలు


నన్నయ వర్సిటీ కౌంటింగ్ కేంద్రం


గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు



కాకినాడ జిల్లాకు సంబంధించి ఓట్లు లెక్కించే జేఎన్టీయూకే కౌంటింగ్ కేంద్రం

పిఠాపురానికి భారీగా పోలీసు బలగాలు

నాలుగు ప్లాటూన్ల సీఐఎస్ఎఫ్, ఏపీఎస్పీ, ఏఎన్ఎస్ పార్టీలు

ఏసీబీ ఎస్పీ రామ్మోహనరావు



పిఠాపురం, జూన్ 3: కౌంటింగ్ సమయంలో, అనంతరం పిఠాపురం నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిగా నియమితులయిన ఏసీబీ ఎస్పీ రామ్మోహనరావు సోమవారం రాత్రి వెల్లడించారు. నియోజకవర్గంలో రెండు ప్లాటూన్ల సీఐఎస్ఎఫ్, ఒక ప్లాటూన్ ఏపీఎస్పీ బలగాలతో పాటు ఒక ప్లాటూన్ ఏఎన్ఎస్ పార్టీ, సివిల్ పోలీసులు 100 మంది, ఇతర విభాగాలు నుంచి 25 మందిని బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నామని వివరించారు. ఏడు క్విక్ రెస్పాన్స్ టీములు, ఏడు మొబైల్ టీములు, ఒక స్ట్రైకింగ్ ఫోర్స్, రెండు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు, వజ్ర వాహనం, రోప్ పార్టీలను రంగంలోకి దించామని తెలిపారు. 25 ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యాత్మకంగా గుర్తించిన 18 గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, సమస్యలు సృష్టించే 30మందిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. 509 మందికి సెక్షన్ 149 కింద నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్, ఎలక్షన్ అధికారులు అనుమతి పొందిన ఏజెంట్లు, అభ్యర్థులు, వారి తరపు ప్రతినిధులు మినహా మిగిలిన వారు కాకినాడ కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదని చెప్పారు.

డైరెక్టర్ బుచ్చిబాబుకు నాగబాబు పరామర్శ


బుచ్చిబాబును పరామర్శిస్తున్న నాగబాబు

కొత్తపల్లి, మే 3: పితృ వియోగంతో బాధపడుతున్న సినీ డైరెక్టర్ సానా బుచ్చిబాబును కొత్తపల్లిలో సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పరామర్శించారు. తండ్రి లేని లోటు తీర్చడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. మనో నిబ్బరంతో తదుపరి కార్యక్రమాన్ని కొనసాగించాలని ధైర్యం చెప్పారు. పలువురు జనసేన నాయకులు, పవన్‌కల్యాణ్ అభిమానులు పరామర్శించారు.

వక్ర పాదాల సమస్యకు శాశ్వత పరిష్కారం

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 3 వక్ర (వంకర) పాదాలతో పుట్టిన పిల్లల అంగ వైకల్యానికి క్యూ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ (సీఐటీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్‌లో పూర్తిస్థాయి చికిత్సను అందించడం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్థోపెడిక్ విభాగాధిపతి డా.ఎంపీఆర్ విఠల్ అన్నారు. వరల్డ్ క్లబ్ ఫుట్ డే సందర్భంగా సోమవారం జీజీహెచ్ ఆర్థో విభాగంలో వక్ర పాదాలతో పుట్టిన పిల్లలకు ప్రత్యేక చికిత్సను అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్, అనస్తీషియా విభాగాధిపతి డా. ఏ విష్ణువర్ధన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.విఠల్ మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే వక్రపాదాల అంగవైకల్యం సాధారణంగా మేనరికపు వివాహాలు లేదా గర్భస్త సమయంలో వాడకూడని మందులు వాడడం లేదా గర్భం దాల్చిన సమయంలో తల్లికి కొన్ని జబ్బులు రావడం లేదా జన్యుపరమైన కొన్ని కారణాల వల్ల లేదా వంశపారంపర్యంగా సంక్రమించే పరిస్థితులు ఉన్నాయన్నారు. వక్ర పాదంతో జన్మించిన శిశువుకు శస్త్రచికిత్స లేకుండా పూర్తిగా సమస్యను పరిష్కరించవచ్చన్నారు. పాన్సెట్టి పద్ధతి ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. సమస్య జటిలంగా ఉంటే టినాటమి అనే చిన్న శస్త్రచికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. చికిత్స అనంతరం ఫ్యాబ్ ఫుట్ అబ్‌డక్షన్ బ్రేస్ అనే ప్రత్యేక షూస్ చిన్నారులకు ధరింప చేసి తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చన్నారు. తద్వారా పిల్లల పాదాలు సాధారణ స్థాయికి వచ్చి అందరిలాగే వారి భవిష్యత్తు బంగారమయమవుతుందన్నారు. ఈ సీఐటీ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్‌లో 2017 నుంచి ఇప్పటి వరకు 249 మంది చిన్నారులకు చికిత్స అందజేసినట్లు చెప్పారు. సోమవారం మరో 22 మంది చిన్నారుల పేర్లు నమోదు చేసి చికిత్స అందజేస్తున్నామన్నారు. ఈ ప్రత్యేక వైద్య చికిత్సకు సంబంధించిన ఖర్చు అంతా సీఐటీ స్వచ్ఛంద సంస్థ భరిస్తుందన్నారు. వక్ర పాదాలతో జన్మించిన పిల్లలకు ప్రతి గురు, శుక్రవారాల్లో జీజీహెచ్ ఆర్థో విభాగంలో ప్రత్యేక వైద్య చికిత్స అందించనున్నట్లు చెప్పారు. ఎవరైనా వక్ర పాదాలతో బాధపడుతున్నట్లయితే ఆంధ్రప్రదేశ్ క్యూర్ క్లబ్ ఫుట్ సంస్థ హెల్ప్‌లైన్ నెంబర్ 8800020503లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్థో వైద్య నిపుణులు డా. ముఖర్జీ, డీసీఎస్ఆర్ఎంఓ డా.అనిత, క్యూర్ ఇండియా సంస్థ కోఆర్డినేటర్ ఎస్.కిరణ్‌రాయ్, ఆర్థో విభాగ పీజీలు పాల్గొన్నారు.



చికిత్సా శిబిరానికి హాజరైన చిన్నారులు, తల్లులు

చింత చిగురు ధర పైపైకి



కరప, జూన్ 3: వేసవికాలంలో దొరికే చింత చిగురును ఇష్టపడనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఎన్నో ఔషధ గుణాలున్న ఈ చింత చిగురు ధర ఆకాశాన్నంటుతుంది. చింత చిగురు ధర ప్రస్తుతం చిటారు కొమ్మకు చేరడంతో ఆహార ప్రియులు దాన్ని కొనేందుకు జంకుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్‌గా కేజీ ధర రూ.400ల వరకు పలుకుతోంది. పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.600ల వరకు ఉంటుందని వినియోగదారులు చెబుతున్నారు. చింత చిగురులో ఎక్కువ ప్రొటీన్లు, తక్కువ కొవ్వు పదార్థాలు కలిగి ఔషధ గుణాలు సమృద్ధిగా ఉండడంతో పాటు ఏ కూరలో వేసుకున్నా మంచి రుచిని కలిగిస్తుంది. అందుచేత చింత చిగురుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది.

పూనమ్ చతుర్వేదికి బాహుబలి కాజా



రాజమహేంద్రవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో కెల్లా పొడవైన అమ్మాయి పూనమ్ చతుర్వేదికి సురుచి బాహుబలి కాజా సోమ వారం అందించారు. కోయంబత్తూరులో జరుగుతున్న బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కు చెన్నై నుంచి వెళుతుండగా ఆమెను రాజ మహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో సురుచి పీఆర్‌వో వర్మ కలిసి కాజా, స్వీట్స్ అందించారు. పూనమ్ చతుర్వేది ఈస్ట్రన్ రైల్వే ఉద్యోగి, బాస్కెట్ బాల్ ప్లేయర్. ఆమె రైలు దిగడంతో ప్రయాణికులు ఆశ్చర్యంగా చూశారు. పలువురు ఆమెతో ఫొటో తీయించుకున్నారు.



అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం


ఆత్రేయపురం, జూన్ 3: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కలిదిండికి చెందిన మన్నె అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.2,95871 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. వాడపల్లి వెంకన్న ఆలయానికి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని చెప్పారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఆయన చెప్పారు.

ఒమ్మంగి యువకుడి హత్య కేసులో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు, జూన్ 3: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన యువకుడు మొగలి సతీష్ హత్య కేసులో నిందితులను సోమవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ విలేకరులకు అందించారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన మొగలి సతీష్(33) మే 4న జ్యూస్ తాగి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అలా వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని భార్య మొగలి విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే 4వ తేదీ రాత్రి ఒమ్మంగికి చెందిన బుర్రా దొరబాబు సతీష్‌ను ధర్మవరం గ్రామ శివారు పోలవరం కాలువ గట్టు వద్దకు రప్పించి ఒమ్మంగికి చెందిన గాడిదల లోవరాజు అనే వ్యక్తి సహాయంతో సతీష్‌ను ఇనుప రాడ్‌తో కొట్టి హత్య చేశాడు. అనంతరం లోవరాజు సహాయంతో సతీష్ మృతదేహాన్ని, సతీష్ బండిని ట్రాక్టర్‌పై వేసి ఉత్తరకంచి, పొదురుపాక పొలాల సరిహద్దుకు తరలించారు. దొరబాబు మామగారు అయిన వాయిలశెట్టి విశ్వనాథం సహాయంతో ఉత్తరకంచి పొదురుపాక సరిహద్దు సర్వే తోటల్లో గొయ్యి తీసి సతీష్ మృతదేహాన్ని పాతిపెట్టారు. అనంతరం సతీష్ మోటార్ బైక్‌ను ఎవరికీ అనుమానం రాకుండా మే 5వ తేదీ రాత్రి పెదమల్లాపురం గ్రామ శివారులో పెట్రోల్ పోసి దొరబాబును తగలబెట్టారు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న దొరబాబు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి వద్ద లొంగిపోయి వ్యక్తిగత కక్షలతోనే తాను 4వ తేదీ రాత్రి మొగలి సతీష్‌ను హత్య చేసినట్లు చెప్పాడు. స్థానిక సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్, తహసీల్దార్ నరసింహారావు పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. ఈ కేసులో నిందితులైన బుర్రా దొరబాబు ఒమ్మంగిలోను, గాడిదల లోవరాజును రాచపల్లిలో అరెస్ట్ చేసి స్థానిక కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. దొరబాబుకు సహకరించిన అతని మామ వాయిలశెట్టి విశ్వనాథాన్ని అరెస్ట్ చేయాల్సి ఉందని అతని కోసం గాలింపు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధ్యవర్తిత్వంలో న్యాయవాదులకు తర్ఫీదు

పీడీజే గంధం సునీత


వివరాలు వెల్లడిస్తున్న జడ్జి సునీత

రాజమహేంద్రవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలకు చెందిన 30 మంది న్యాయవాదులకు 7వ తేదీ వరకూ మధ్యవర్తిత్వంలో తర్ఫీదు ఇస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఢిల్లీకి చెందిన సీనియర్ ట్రైనర్లు వినయ్ కుమార్ గుప్తా, సునీల్ కుమార్ అగర్వాల్ మొత్తం 40 గంటలపాటు శిక్షణ ఇస్తారన్నారు. సుప్రీంకోర్టు వారి మధ్యవర్తిత్వం, రాజీమార్గ పథక సంఘం(ఎంసీపీసీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మధ్యవర్తిత్వం వల్ల సమయం వృథా కాదని, త్వరితగతిన ప్రయోజనం చేకూరుతుందని ఆమె స్పష్టం చేశారు. ఖర్చులు లేకపోవడమే కాకుండా సామరస్య పూర్వకంగా కేసులు పరిష్కారం అవుతాయన్నారు.

ఘనంగా రావులమ్మ జాతర

అంబాజీపేట, జూన్ 3: కె.పెదపూడి గ్రామదేవత శ్రీరాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరలో గరగనృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా సైక్లింగ్ డే


ముమ్మిడివరంలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సైక్లిస్టులు


అమలాపురంలో సైకిల్ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మలికిపురం, జూన్ 3: ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా హెల్త్ సైక్లింగ్ గ్రూపు కోనసీమ, మానవతామూర్తుల గ్రూపు ఆధ్వర్యంలో కేశనపల్లి హైస్కూలు నుంచి కరవాక వరకు సోమవారం సైక్లింగ్ నిర్వహించారు. సర్పంచ్ జి.సత్యనారాయణ, ముదునూరి లతేంద్రవర్మ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కుదాం అంటూ పెద్దలు, యువత, పిల్లలు నినాదాలు చేశారు. ముఖ్య అతిథులు డాక్టర్ జాన వీరభద్రప్రసాద్, డాక్టర్ కేసీఎంఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ సైకిల్ తొక్కవడం వల్ల గుండె పనితీరు మెరుగు పడుతుందని, మోకాళ్లు బలపడడం వంటి అనేక లాభాలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ 15నుంచి 20కిలోమీటర్లు సైక్లింగ్ చేయాలన్నారు. సైకిల్ రిపేరు ద్వారా ఉపాధి పొందుతున్న ఒక దివ్యాంగునికి రూ.7,500, గుడ్డ సంచులు తయారుచేసి ఉచితంగా పంచుతున్న భైరవమూర్తికి పెట్టుబడిగా రూ.5వేలు అందించారు. ఎంపిక చేసిన పది మంది వృద్ధ సైక్లిలిస్టులకు, పది మంది సైకిల్ మెకానిక్‌లకు స్వీటు బాక్సులు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అడబాల విజయ్‌శ్రీనివాస్, బోనం రాజు, గంగాప్రసాద్, జైదీప్, హరికృష్ణ, తేజ, కందుల విజయ్‌కుమార్, నారాయణమూర్తి, దెందుకూరి రాంబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ దినోత్సవ ర్యాలీ

అమలాపురం టౌన్, జూన్ 3: అంతర్జాతీయ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు ర్యాలీ నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్ వద్ద క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. నల్లవంతెన, ఎర్రవంతెన, గొల్లగూడెం బైపాస్ రోడ్డు, హైస్కూలు సెంటరు మీదుగా ర్యాలీ తిరిగి గడియార స్తంభం సెంటర్‌కు చేరుకుంది. సైక్లిస్టులు పేరి లక్ష్మీనరసింహం, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పుత్సా కృష్ణకామేశ్వర్, వలవల వెంకటరెడ్డినాయుడు, పట్నాల వెంకటరమణ, కుడుపూడి త్రినాధరావు, పీవీఆర్ నాయుడు పాల్గొన్నారు.

మాయలు, మంత్రాలు లేవు.. అంతా సైన్సే


విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పిస్తున్న పాపారావు

అమలాపురం టౌన్, జూన్ 3: మాయలు మంత్రాలు ఏమీ లేవని ఉన్నదంతా సైన్సేనని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదంతో కూడిన విజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా బాలల వేసవి వినోద కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక సూర్యనగర్‌లోని గోపాలకృష్ణ గోఖలే మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో జిల్లా శాఖ అధ్యక్షుడు కె.సత్యనారాయణ అధ్యక్షతన సైంటిఫిక్ మెజీషియన్ కాటూరు నాగేశ్వరరావు వైజ్ఞానిక ప్రదర్శన ఇచ్చారు. మేజిక్ వెనుక మాయలు మంత్రాలు మహాత్యాలు ఏమీ ఉండవని విద్యార్థులకు వివరించారు. గుడ్డ నుంచి పుష్పగుచ్ఛాలు తీయడం, పేపర్‌ను రూపాయి నోటుగా మార్చడం, అరచేతిలో కర్పూరం వెలిగించడం తదితర ప్రదర్శనలు చేశారు. మేజిక్ ట్రిక్స్ వెనుక ఉన్న సైన్స్‌ను విద్యార్థులకు వివరించారు. అనంతరం మెజీషియన్ నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకుడు మామిడిశెట్టి వెంకటేశ్వరరావు, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, గోపాలకృష్ణ, బీఎస్ వెంకటేశ్వరరావు, బీఎస్సార్ ప్రసాద్, హెచ్ఎం ఎన్.గంగరాజు, ఎస్.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యానాంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

యానాం, జూన్ 3: పుదుచ్చేరి పార్లమెంట్‌కు సంబంధించి యానాం నియోజకవర్గంలో పోలైన ఓట్లను మంగళవారం లెక్కించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కమిషన్ నియమించిన పరిశీలకుడు రాకేశ్‌కుమ్రా ఆదివారం యానాం చేరుకున్నారు. సోమవారం ఉదయం యానాం అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మునిస్వామి, ఇతర అధికారులతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఓట్ల లెక్కింపునకు పది టేబుళ్లు ఏర్పాటు చేశారు. నాలుగు రౌండ్లలో ఓట్లు లెక్కించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అందరు సహకరించాలని యానాం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి కోరారు.


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు

అల్లవరం, జూన్ 3: ఎక్సైజ్ శాఖ బెల్ట్‌షాపులను నియంత్రించకపోవడంతో మద్యం విక్రయాలు బంద్ రోజున మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. క్వార్టర్ మద్యం సీసాపై రూ.100 అదనంగా మందుబాబుల జేబులకు చిల్లుపడ్డాయి. దేవగుప్తం, మార్కెట్, కోడూరుపాడు, కొమరగిరిపట్నం, ఓడలరేవు, అల్లవరం, బోడసకుర్రు తదితర గ్రామాల్లో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం అమ్మకాలు హోరెత్తాయి. ఎక్సైజ్ శాఖ దాడులు చేయకపోవడం గమనార్హం.

కరాటే పోటీల్లో పతకాలు



ఆత్రేయపురం, జూన్ 3: కోనసీమ జిల్లా స్థాయి కరాటే పోటీలో తోటకూర నయన్‌వర్మ గోల్డ్ మెడల్ సాధించాడు. ఫైటింగ్ విభాగంలో వర్మ సిల్వర్ మెడల్ అందుకున్నాడు. జూనియర్ విభాగంలో పాలపర్తి దీక్షిత రాజు వివిధ విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించిందని కోచ్ కిరణ్ తెలిపారు. విద్యార్థులను గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు అభినందించారు.

● అంగర ఎస్‌ఐ ఎ.పరదేశి
● సమస్యాత్మక గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ● ర్యాలీలు, సమావేశాలు నిషేధం

ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలి

కపిలేశ్వరపురం, జూన్3: జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల నిబంధనలను అనుసరించి ప్రజలు నడుచుకోవాలని అంగర ఎస్‌ఐ ఎ.పరదేశి అన్నారు. సోమవారం ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ పర్యవేక్షణలో మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్‌ఐ తెలిపారు. కౌంటింగ్ అనంతరం ర్యాలీలు, సమావేశాలు, బాణసంచా కాల్చడం, డ్రోన్ కెమెరాలతో చిత్రీకరణ చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బూత్ ఏజెంట్లు ఫామ్-17సీ, ఐడీ కార్డు, ఆధార్‌కార్డు తప్ప మరే ఇతర వస్తువులు తీసుకువెళ్లకూడదన్నారు.


కపిలేశ్వరపురం: అంగర పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు పరిశీలిస్తున్న ఎస్‌ఐ పరదేశి

కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తు పాడుచేసుకోవద్దు

మామిడికుదురు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా జిల్లాలో సెక్షన్ 144, 30పోలీసు యాక్టు అమలులో ఉందని, నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒక చోట ఉండకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని నగరం ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం బాణసంచా కాల్చడం, మోటారుసైకిళ్ల సైలెన్సర్లు తీసి నడపడం వంటివి చేయకూడదని, ఎన్నికల ఫలితాలపై కించ పరిచేవిధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టరాదని సూచించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ సూచించారు.

144 సెక్షన్ అమలు

మండపేట, జూన్ 3: సార్వత్రిక ఎన్నికలు ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి నేపథ్యంలో మంగళవారం మండపేటలో ప్రభుత్వ ఆదేశాల మేరకు దుకాణాలు మూసివేయాలని నిర్ణయించారు. మండపేట పట్టణం, మండపేట నియోజకవర్గంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఇప్పటికే అనుమానితులు, రౌడీషీటర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండపేటలో పట్టణ సీఐ అఖిల్‌జమా సారథ్యంలో మండపేట కలవపువ్వు సెంటరు, రాజారత్న సెంటర్, మారేడుబాక వంతెన వద్ద పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. మండపేట పట్టణంలో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్, మండపేట మండలంలో మూడు ఫ్లయింగ్‌స్క్వాడ్స్, రాయవరం మండలంలో మూడు ఫ్లయింగ్‌స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. మండపేటలో ఉన్న టీడీపీ, జనసేన, వైసీపీ కార్యాలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం, ఊరేగింపులు నిషేధించిన నేపథ్యంలో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముఖ్యకూడళ్లలో పోలీస్ పికెట్లు

అంబాజీపేట, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలోని ముఖ్య కూడళ్లల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పోలీస్ నిఘాను పెంచామన్నారు. జిల్లాలో 144, 30సెక్షన్లు అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు గుమిగూడి ఉండకూడదన్నారు. ఫలితాలు అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మోటార్‌సైకిళ్ల సైలెన్సర్లు తీసి అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి

అల్లవరం, జూన్ 3: కౌంటింగ్ రోజున ఏజెంట్లు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ కోరారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను వెంట తీసుకుని వెళ్లకూడదన్నారు. వారి వద్ద పెన్ను, పేపరు మాత్రమే ఉండాలన్నారు.

తీవ్ర ఉత్కంఠకు నేటితో తెర.. విజయావకాశాలపై ఆశలు

● నేడు సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు
● ఫలితాలపై అభ్యర్థుల ఆందోళన



చెయ్యేరు ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు, కళాశాల ఆవరణలో పోలీసు బందోబస్తు

ముమ్మిడివరం, జూన్ 3: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలోని స్వామి వివేకానంద సెమినార్ హాలులో మంగళవారం ఉదయం ప్రారంభమవుతుంది. 268బూత్‌లకు సంబంధించి ఒక్కో రౌండుకు 14టేబుళ్లు ఏర్పాటుచేసి మొత్తం 20రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. నియోజకవర్గంలో మొత్తం 2,45,296మంది ఓటర్లు ఉండగా 2,05,163 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరపున దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), వైసీపీ నుంచి పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, కాంగ్రెస్ నుంచి పాలెపు ధర్మారావుతో పాటు మరో 12మంది రంగంలో ఉన్నారు. ఎగ్జిట్ పోల్స్‌లో కూటమికి అనుకూలంగా ఉండడంతో గెలుపు తమదే అనే ధీమాలో వారున్నారు. నవరత్నాలు, ఓటింగ్ సరళిని బట్టి తమ పార్టీ ఘన విజయం సాధిస్తుందని వైసీపీ ధీమా వ్యక్తం చేశారు. ఎవరికి వారు అంచనాలతో కోట్లలో పందేలు కాసుకున్నారు.

అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 3: రామచంద్రపురం నియోజకవర్గంలో హోరాహోరీగా జరిగిన సార్వత్రిక ఎన్నికల పోరులో అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. మంగళవారం ఓట్ల లెక్కింపుతో ఫలితాలపై తీవ్ర ఉత్కం ఠకు తెరపడనుంది. కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, వైసీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ మధ్య పోటీ ఉంది. రామచంద్రపురం నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు 10టేబుళ్లు ఏర్పాటుచేశారు. నియోజకవర్గంలోరామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో మొత్తం 239బూత్‌లు ఉన్నాయి. రౌండ్‌కు 10బూత్‌లు చొప్పున ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 24రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తికానుంది. రామచంద్రపురం నియోజకవర్గంలో రామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో 2,03,207 మంది ఓటర్లకు పురు షులు 1,00,682, మహిళలు 1,02,524, ఇతరులు ఒకరు ఉన్నారు. నియోజకవ ర్గంలో ఏర్పాటుచేసిన 239 బూత్‌ల్లో ఈవీఎంల ద్వారా 173917మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 87,429, మహిళలు 86,487, ఇతరు ఒకరు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2,384 మంది పోస్టల్ బ్యాలెట్లకు 2323మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 66మంది సర్వీసు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గన్నవరం ఎవరికి దక్కనుందో!

పి.గన్నవరం, జూన్ 3: 2004 పునర్విభజనకు ముందు పి.గన్నవరం నియోజకవర్గంలో మామిడికుదురు, పి.గన్నవరం మండలాలు పూర్తిగా, అంబాజీపేట మండలంలో ఇసుకపూడి, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, చిరతపూడి గ్రామాలు ఉండేవి. 2004 పునర్విభజన తర్వాత పి.గన్నవరం నియోజకవర్గంలో పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాలు పూర్తిగా, మామిడికుదురు మండలంలో 11 గ్రామాలు ఉన్నాయి.

పి.గన్నవరం నియోజకవర్గంలో పురుషులు 99,943 మంది, మహిళలు 98,653మంది, ఇతరులు6 మొత్తం 1,98,602మంది ఓటర్లు ఉన్నారు. మే 13న జరిగిన పోలింగ్‌లో పురుషులు 84,467, మహిళలు 81,279, ఇతరులు 3 మొత్తం 1,65,749 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 1,970మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధాన పార్టీలతో పాటు 14మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ముఖ్యంగా కూటమి తరపున జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, వైసీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు మధ్య పోటీ తీవ్రంగా ఉంది. కూటమే అభ్యర్థి విజయం సాధిస్తారని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చెబుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. బీఎస్పీ అభ్యర్థి ప్రచారం జోరుగా సాగించారు. కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు చీల్చే ఓట్లు వైసీపీదేనని విశ్లేషకులు చెబుతున్నారు. నియోజకవర్గంలో 212పోలింగ్ బూత్‌ల్లో పోలింగ్ జరిగింది. మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామం బూత్ ఈవీఎం ఓట్ల లెక్కింపు తొలుత ప్రారంభిస్తారు. అయినవిల్లి మండలం శానిపల్లిలంక బూత్ ఈవీఎం ఓట్ల లెక్కింపుతో ముగుస్తుంది. అంబాజీపేట, అయినవిల్లి మండలాలు కీలకంగా మారాయి. ఈమండలాలను ఆధారంగా నాయకులు లెక్కలు వేసుకుని పందెలు కాసుకుంటున్నారని సమాచారం. పోస్టల్ బ్యాలెట్లు ఎక్కువ శాతం కూటమికే అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తుంది.

అభ్యర్థుల టెన్షన్‌కు తెరపడేది నేడే

రావులపాలెం, జూన్ 3: కొత్తపేట నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, వైసీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి గెలుపు తమదంటే తమదంటూ కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగే కౌంటింగ్‌లో వారి భవితవ్యం తేలనుంది. కాగా గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు.

వేగుళ్లకు కూటమి నేతల అభినందనలు

మండపేట, జూన్ 3: మండపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును సోమవారం పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండపేట నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కాపు సంఘం పట్టణ నాయకులు, ముస్లిం పెద్దలు, వివిధ కుల సంఘాల నేతలు వేగుళ్లను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. తనను కలిసి అభినందించిన వారందరికి వేగుళ్ల కృతజ్ఞతలు తెలిపారు.


వేగుళ్లను అభినందిస్తున్న కూటమి నేతలు

మల్లాడిని కలిసిన ఎమ్మెల్యే అభ్యర్థులు


మల్లాడితో సమావేశమైన పిల్లి సుభాష్‌బోస్ తదితరులు

యానాం, జూన్ 3: పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును వివిధ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులు మర్యాదపూర్వకంగా కలిసారు. నరసాపురం కూటమి అభ్యర్థి (జనసేన) బొమ్మిడి నాయకర్, కాకినాడ సిటీ కూటమి (టీడీపీ) వనమాడి కొండబాబులు మల్లాడిని కలిసారు. కౌంటిగ్ జరగనున్న నేపథ్యంలో గురువు మల్లాడి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మల్లాడిని కలిశారు. ఎన్నికల్లో తన కుమారుడికి అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మల్లాడిని సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి కూటమి అభ్యర్థుల పూజలు



ఐ.పోలవరం, జూన్ 3: మురమళ్ల భద్రకాళీవీరేశ్వర స్వామిని సోమవారం పెద్దాపురం, ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థులు నిమ్మకాయల చినరాజప్ప, దాట్ల బుచ్చిబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జంపన బాబు, ఏలూరి మూర్తి, జంపన రామభద్రరాజు, దాట్ల వర్మ, ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అన్నసమారాధన

అంతర్వేది, జూన్ 3: సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం గ్రామంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ఆత్రేయపురం, జూన్ 3: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన విషయాలు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను గ్రంథాలయాధికారి నమ్మశివాయ వివరించారు.

ఘనంగా నరసింహస్వామి శాంతి కల్యాణం


ఘనంగా స్వామివారి శాంతి కల్యాణం దృశ్యం

అంతర్వేది, జూన్ 3: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద బహుళ ద్వాదశిని పురస్కరించుకుని సోమవారం స్వామివారి శాంతి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత ప్రత్యేక సింహాసనంపై స్వామి-అమ్మవార్లను కొలువుతీర్చి అలంకరించారు. అనంతరం అర్చకులు కల్యాణతంతు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శాంతి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న ఆటో డ్రైవర్

అల్లవరం, జూన్ 3: కోడూరుపాడు వద్ద సోమవారం ఆగి ఉన్న ఇంజనీరింగ్ కళాశాల బస్సును ఆటో ఢీకొని తిరబడింది. ఆటో డ్రైవర్‌కు గాయాలు కాగా గమనించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	:గంగం గణేశా
శ్రీలలిత	: హిట్‌లిస్ట్
శేఖర్ స్క్రీన్-1	: రాజు యాదవ్
శేఖర్ స్క్రీన్-2	: ఆ ఒక్కటీ అడక్కు
రమా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	: బాక్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: భజే వాయువేగం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: లవ్ మీ

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు, జూన్ 3: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి గళ్లా పవన్‌కుమార్-అనీష దంపతులు రూ.1,00,116 విరాళం అందించారు. దాత దంపతులకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు. కార్యక్రమంలో బొక్కా సత్యంమూర్తి, గొడవర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమిదే అధికారం

రాయవరం, జూన్ 3: కేంద్రంలో నరేంద్రమోదీ తిరిగి మూడోసారి ప్రధాని కావడం ఖాయమని అన్ని సర్వేలు చెబుతున్నాయని, ఏపీలో కూటమి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని లొల్ల సర్పంచ్, బీజేపీ నాయకుడు చాట్రాతి జానకి రాంబాబు అన్నారు. సోమవారం లొల్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కూటమిదే అధికారమని ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు ఉపయోగపడేలా 'ఉపాధి' పనులు

అల్లవరం, జూన్ 3: రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధి హామీ పథకంలో పూడికతీత పనులు జరుగుతున్నాయని ఏపీవో వి.శ్రీనుబాబు అన్నారు. బోడసకుర్రు, గోడిగ్రామాల్లో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పంట బోదెలు, కాల్వల వద్ద చెత్తాచెదారం తొలగింపు పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. క్షేత్ర సహాయకులు బొంతు శ్యామ్‌ప్రసాద్, ఎం.రమేష్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో అభ్యర్థులు పూజలు


వెంకన్న ఆలయంలో కూటమి అభ్యర్థులు బండారు సత్యానందరావు, చింతమనేని ప్రభాకరరావుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం


వెంకన్న ఆలయంలో ఉంగుటూరు జనసేన అభ్యర్థి ధర్మరాజు

ఆత్రేయపురం, జూన్ 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని పలు అసెంబ్లీ స్థానాలకు పోటీచేసిన అభ్యర్థులు సోమవారం దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు.కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యా నందరావు-కమలారాణి దంపతులు, దెందులూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు అసెంబ్లీ జనసేన అభ్యర్థి పత్సమట్ల దర్మరాజు, దెందులూరు ఎమ్మెల్యే కొటారి అబ్బాయిచౌదరి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వారికి పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, మద్దూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

మలికిపురం, జూన్ 3: బట్టేలంకకు చెందిన పెసింగి సోమరాజు 11రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతని డిగ్రీ స్నేహితులు రూ.50వేలు సమీకరించి సోమవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ద్వారా సోమరాజు కుటుంబానికి అందజేశారు. రాపాక నవీన్, పెదపాటి అనిల్, స్టీవెన్, చవాకుల రాజు, గెద్దం రవి, మంగెన సతీష్, చింతా రమేష్, చొప్పల రాజేంద్ర, దిలీప్, భాను, అనిల్ పాల్గొన్నారు.

బోడసకుర్రులో మేకల దొంగతనాలు

అల్లవరం, జూన్ 3: పదులసంఖ్యలో బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని పల్లిపాలెంలో మేకల దొంగతనాలు జరగడంతో పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. ఏడాది కాలంలో 50కిపైగా మేకల దొంగతనాలు జరిగాయన్నారు. ఒక్కొమేక రూ.10వేలు నుంచి రూ25వేలు ధర పలుకుతుండగా మేకలను దొంగలు రాత్రి సమయాలలో ఎత్తుకుపోతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతా నూకరాజు, పెమ్మాడి కోట సత్యం, కొల్లు సత్యవతి, కొప్పాడి దుర్గారావు, సంగాని భేతాళుడు, కాలాడి నాగరాజు, అర్జునరావులకు చెందిన మేకలను దొంగలు ఎత్తుకుపోయారు. ఈమేకల దొంగతనాలపై వారం రోజులకిత్రం బాధితులు అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పేరూరుకు చెందిన మేకల పెంపకం దారుని మందలో దొంగలించిన మేక దొరకడంతో ఈదొంగతనాలు బయటపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేకల దొంగతనంపై ఫిర్యాదు వచ్చిందని దొంగలించిన మేక ఒకటి దొరకగా ఆ యాజమానికి అప్పగించినట్లు ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

శివాలయంలో మంత్రి విశ్వరూప్ పూజలు

అంబాజీపేట, జూన్ 3: నందంపూడిలోని శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో మంత్రి పినిపే విశ్వరూప్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు యలమంచలి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. ఆయనకు పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు.

ముమ్మిడివరం తరలివెళ్లిన కూటమి నేతలు

మండపేట, జూన్ 3: ముమ్మిడివరంలో మంగళవారం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మండపేట నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సోమవారం మండపేట నుంచి ముమ్మిడివరానికి బయలుదేరి వెళ్లారు.